ప్రజాశక్తి

ఆదివారం 21 మే 2023

జాయింట్ కలెక్టర్‌గా గోవిందరావు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఆర్.గోవిందరావు నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. ప్రస్తుతం ఆయన టూరిజం శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో పార్వతీపురం ఆర్‌డిఒగా పని చేసిన ఆయన జెసిగా రావడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జెసిగా పనిచేసిన ఆనంద్ బదిలీ కావడంతో ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

- కబడ్డీ అకాడమీ ఏర్పాటుకు కృషి
- జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన విజయనగరం జట్లు

తలపడుతున్న శ్రీకాకుళం, తూర్పుగోదావరి బాలుర జట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు జరిగే 66 వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. 13 జిల్లాల నుంచి 4వందల మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం అంటే క్రీడలకు ప్రసిద్ధి అన్నారు. అన్ని జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు బాగా ఆడి రాష్ట్రం నుంచి జాతీయ పోటీల్లో రాణించి దేశంలో మన రాష్ట్ర ప్రతిష్టను చాటి చెప్పాలన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. నగర మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు,శారీరక దారుఢ్యం ఇస్తాయని అన్నారు. రాష్ట్ర పోటీలలో సత్తా చాటి జాతీయ స్థాయిలో మన ప్రతిష్టను చాటి చెప్పాలన్నారు. డిఇఒ సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలను ఉపయోగించుకోవడం ద్వారా మంచి ఉద్యోగాలు సాధించేందుకు దోహదం పడతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల శ్రావణి, సెట్విజ్ సిఇఒ రాంగోపాల్, రాష్ట్ర పరిశీలకులు జయరాజ్, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల జిల్లా కో ఆర్డినేటర్ చంద్రకళ, మన్యం జిల్లా చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు, అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణ, కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కె.తవిటిరాజు, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఎల్‌వి రమణ, 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం తొలి విజయనగరం, విశాఖపట్నం బాలికల జట్ల మధ్య పోటీలను ప్రారంభించారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న ఈ పోటీల్లో తొలిరోజు విజయనగరం బాల,బాలికలు జట్లు బోణీ కొట్టాయి. బాలికల జట్టు లీగ్ దశలో గ్రూప్- డి లో తూర్పు గోదావరి జట్టు పై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. విజయనగరం బాలుర జట్టు సి- పూల్ విభాగంలో అనంతపురం జట్టు పై విజయం సాధించింది. విశాఖపట్నంతో జరిగిన లీగ్ మ్యాచ్ లో పూల్ విన్నర్ గా విజయనగరం బాలురు జట్టు 24-22 స్కోర్ చేసి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ఆదివారం క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్ లు జరగనున్నాయి. కార్యక్రమంలో కబడ్డీ గురువు బొమ్మాన రామారావు, ఖో ఖో గురువు చిన్నం నాయుడు, అసోసియేషన్ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఘనంగా ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవం

తెలుగు ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా ఉంటారు : టిడిపి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, సినీనటుడు నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాన్ని శనివారం అశోక్‌బంగ్లాలో టిడిపి ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. తీన్‌మార్ డప్పుల మోత, ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యాన అలనాటి ఎన్‌టిఆర్ పాటలతో ఆ ప్రాంతం సందడిగా మారింది. ఈ సందర్భంగా పార్టీ మినీ మహానాడు కూడా నిర్వహించారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి నాయకులంతా పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పార్టీ విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు మాట్లాడారు. ఎన్‌టిఆర్ ప్రజలందరి గుండెల్లో ఉండే వ్యక్తి అని, టిడిపిని ఏర్పాటుచేసి ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని అన్నారు. పేదల కోసం రెండు రూపాయలకే కిలోబియ్యం పథకం పెట్టడం ద్వారా పేదలందరికీ తిండి దొరికిందన్నారు. పోలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ అన్న ఎన్‌టిఆర్ శత జయంతి మరువలేనిదని అన్నారు. రాజకీయంగా, సినీమా పరంగా రాష్ట్రానికి, దేశానికి మంచి చేశారని కొనియాడారు. దేశానికి ఉపయోగపడిన నాయకుల ను కొందరే ఉంటారని, మరచి పోకూడదన్నారు. బెయిల్‌పై వచ్చిన దొంగను ముఖ్యమంత్రి చేయడం వల్ల రాష్ట్రానికి ఎంత నష్టం జరుగుతుందో మనం చూస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కాకపోతే మనం, మన పిల్లల భవిష్యత్తు నాశనం అవుతాయని అన్నారు. పిరికితనం వద్దు అని, ఆలోచన శక్తి పెంచుకోవాలని అన్నారు. అధికారం పోగానే ముఖం చాటేసిన నాయకులు మనలో కూడా ఉన్నారని, కిరికిరి వ్యవహారాలు వద్దని హితవు పలికారు. మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ పెట్టిన పథకాలు, స్ఫూర్తితో పార్టీ నుంచి నడిపిస్తున్న వ్యక్తి చంద్రబాబు నాయుడు అన్నారు.మాజీ మంత్రి కోండ్రు మురళీ మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పరిపాలన సాగుతోందని అన్నారు. మంత్రులందరూ రాష్ట్రంలో డమ్మీలుగా మారుతున్నారని అన్నారు. మాజీ మంత్రి సంజయ్ కృష్ణ రంగారావు మాట్లాడుతూ వెనుక బడి వర్గాలకు రాజకీయ చైతన్యం కలిగించిన నాయుడు ఎన్టీఆర్ అన్నారు. హైదరాబాద్ కు ధీటుగా అమరావతి తయారు చేస్తాను అనుకున్న చంద్రబాబు అంశలను జగన్మోహన్ రెడ్డి నాశనం చేస్తున్నారని అన్నారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ యుగపురుషుడు, రైతు బాంధవుడు ఎన్‌టిఆర్ అని కొనియాడారు. పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొబ్బిలి చిరంజీవులు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి దళిత ద్రోహి అని, దళిత ఓట్లతో అధికారంలోకి వచ్చి వారినే జైల్లో పెడుతున్నారని అన్నారు. బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆరాధ్యదైవం ఎన్‌టిఆర్ అని, చిరకాలం ప్రజల మనస్సుల్లో ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు 11 మందిని సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఆర్‌పి భంజ్‌దేవ్, కెఎ నాయుడు, తెంటు రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కనక మురళీమోహన్, కంది మురళీ నాయుడు, రొంగలి రామారావు పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ఎన్‌హెచ్‌ఆర్‌సి నియోజకవర్గాల కమిటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) నియోజకవర్గాల కమిటీల నియామకానికి ఆసక్తిగల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు తెలిపారు. పార్వతీపురం పట్టణంలో శనివారం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొర్లి వెంకటరమణారావు, జిల్లా కార్యదర్శి బోనెల పరుశురాంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల కమిటీల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. సామాజిక సేవ చేసే తత్వం, ప్రజా సమస్యల పట్ల పోరాడే గుణం, సామాన్యుల హక్కుల రక్షణ కోసం, వారి ప్రయోజనాలను కాపాడటం కోసం పనిచేసేవారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. విద్యావంతులు, మేధావులు, సంఘ సేవకులు, సామాజిక బాధ్యత కలిగినటువంటి వారితో కమిటీల నియామకం ఉంటుందన్నారు. మానవ హక్కుల పరిరక్షణకు శ్రమించే ఆసక్తి ఉన్నవారు 9494012244 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రెజ్లర్లకు మద్దతుగా నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఢిల్లీలో రెజ్లర్లు చేపడుతున్న పోరాటానికి మద్దతుగా శనివారం సిఐటియు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం కార్యాలయ ఎఒ ఉమామహేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.రాజు, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ పి.రంజిత్ కుమార్ మాట్లాడారు. క్రీడాకారుల పట్ల మోడీ ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందన్నారు. క్రీడాకారులు దేశానికి పతకాలు తీసుకొస్తుంటే, బిజెపి ఎమ్‌పిలు, మంత్రులు మాత్రం వారిపట్ల నీచంగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశంలో రెజ్లర్లపై జరుగుతున్న దాడులపై తీవ్రంగా మండిపడ్డారు. మహిళా రెజ్లర్లకు బిజెపి ఎమ్‌పి బ్రిజ్ భూషణ్, హర్యానా మంత్రి సందీప్ సింగ్ మానసికంగా హింసించి, వారి కించపరిచేలా వ్యవహరించారని, వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ స్థాయి క్రీడాకారులకే ఇంత దుస్థితి ఏర్పడుతుంటే, సాధారణమైన క్రీడాకారిణుల పరిస్థితి ఏమిటోనని ఆందోళన వ్యక్తంచేశారు. ఢిల్లీలో కొన్ని రోజులుగా మండుటెండల్లో రెజ్లర్లు ఆందోళన చేపడుతున్నా ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దౌర్భాగ్యమన్నారు.

కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.జ్యోతి, సిఐటియు నాయకులు బి.సూరిబాబు, వి.గౌరి, ఆర్.వెంకటరత్నం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినతి అందిస్తున్న ఐద్వా, సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రాథమిక విద్య బలోపేతంతోనే

చిన్నారుల భవితకు బాటలు

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-బలిజిపేట

ప్రాథమిక విద్య బలోపేతం చేసి చిన్నారుల బంగారు భవితకు అంగన్వాడీలంతా కలిసికట్టుతో బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. ప్రాథమిక దశలో చిన్నారులకు చక్కని విద్యతోపాటు పౌష్టికాహారం సక్రమంగా అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు సమర్థ వంతంగా పని చేయాలన్నారు. శనివారం బలిజిపేట మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. బలిజిపేటలోని గృహ నిర్మాణ లే అవుట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు - నేడు పనులు, నారాయణపురం పాఠశాలలో అంగన్వాడీ కేంద్రం నూతన భవనాన్ని, బర్లి ప్రాథమికోన్నత పాఠశాలలో అంగన్వాడీ కేంద్ర భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. బర్లి అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, గర్భిణులకు అందిస్తున్న పాల వివరాలను, స్టాక్‌రూంలో రికార్డులను పరిశీలించారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్వాడీ కార్యకర్తలు నిర్వహిస్తున్న లబ్ధిదారుల వివరాల నమోదును సరిచూశారు. సమన్వయ లోపం లేకుండా పౌష్టికాహారం అమలు రికార్డులను కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రం పరిధిలోని బరువు తక్కువ ఉన్న చిన్నారులు, రక్తహీనత కలిగిన గర్భిణులు, బాలింతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని అందుతున్న సేవలను, చిన్నారుల పరిజ్ఞానాన్ని పరీక్షించారు. మడక వేదాన్షి, పలిశెట్టి గీతోన్మయి అనే చిన్నారులు అడిగిన ప్రశ్నలకు చక్కగా జవాబులు చెప్పడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ, వారిని అభినందించారు. చిన్నారుల బంగారు భవిష్యత్తు చక్కగా తీర్చదిద్దడంలో అంగన్వాడీ కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. కేంద్రానికి కరెంట్ లేకపోవడాన్ని గమనించి కలెక్టర్ ప్రశ్నించగా విద్యుత్తు మీటర్ లేదని సిడిపిఒ తెలిపారు. వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఇఒను కలెక్టర్ ఆదేశించారు. సమీపంలోనే నాడు-నేడు రెండో దశ పనులు కింద చేపడున్న నూతన అంగన్వాడీ కేంద్రం భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం గదుల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.రత్నకుమారి, ఎంపిడిఒ ఎ.భానుమూర్తి, గృహనిర్మాణ శాఖ డిఇ ఆర్.ఐ.వి.ప్రసాద్, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి కేతిరెడ్డి విజయగౌరి, ఎంఇఒ శ్రీనివాస్, సిడిపిఒ సిహెచ్.ఎస్ఎస్ఎఇ త్రినాథ్ సుగుణ, ప్రధానోపాధ్యాయులు సుధాదేవి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి సమాధానాన్ని శ్రద్ధగా వింటున్న కలెక్టర్ నిశాంత్

రహదారిపై కూలిన చెట్లు

వాహన రాకపోకలకు అంతరాయం

పి.ఆమిటి ప్రధాన రహదారిపై పడిన చెట్టు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు కురుపాం-గుమ్మలక్ష్మీపురం ప్రధాన రహదారిపై చెట్లు నేలకొరిగాయి. కనీసం ఆర్‌అండ్‌బి అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన పట్ల ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. విద్యుత్తు తీగలపై స్తంభాలపై చెట్లు పడిన గంటల వ్యవధిలో ప్రజల సౌకర్యార్థం రాత్రికి రాత్రి ఆ శాఖ సిబ్బంది స్పందించి చెట్లను తొలిగించి, విద్యుత్ సరఫరా అందిస్తుంటే, ఆర్‌అండ్‌బి అధికారులు ఎందుకు రోడ్లపై చెట్లను తొలగించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటి -మండ- టిక్కబాయి గ్రామాల ప్రధాన రహదారిపై చెట్లు కులాయి. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. కూలిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా వాహన రాకపోకలకు వీలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తదని గుమ్మలక్ష్మీపురం సర్పంచి బొత్తాడ గౌరీశంకర్రావు అన్నారు. రహదారికి ఇరువైపులా కూలేందుకు సిద్ధంగా ఉన్న చెట్లను తొలగించాలని ఆర్‌అండ్‌బి అధికారులను కోరారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-కలెక్టరేట్



సమావేశంలో మాట్లాడుతున్న జెసి

ఈ నెల 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పరీక్ష ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఫస్ట్‌ఎయిడ్ కిట్లను, అవసరమైన మందులతో వైద్య శిబిరాలు అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు తెలిపారు. విద్యుత్తు శాఖ అధికారులు కరెంటు సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీరు అన్ని కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద శానిటేషన్ చేసి, బ్లీచింగ్ చల్లాలని చెప్పారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5.30 వరకు జరుగుతాయని తెలిపారు. ఆ సమయంలో అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఇద్దరు మహిళా పోలీసులు, ఇద్దరు కానిస్టేబుళ్లను నియమించాలని పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. ఇన్విజిలేటర్లు, సూపర్‌వైజర్లు, పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరా లను పరీక్షా కేంద్రాలకు తీసుకు రాకూడదని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరే విధంగా ఆర్‌టిసి బస్సులు నడపాలని ఆదేశించారు. ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణానికి ప్రభుత్వ మార్గదర్శకాలు అనుసరించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి డి.మంజులావీణ, ఆర్‌ఐఒ ఎం.ఆదినారాయణ, హెచ్ సెక్షన్ పర్యవేక్షకులు డి.రవి, విద్యా శాఖ ఎడి పి.వెంకటేశ్వర రావు, జిల్లా ప్రజా రవాణా అధికారి టి.వి.ఎస్. సుధాకర్, మున్సిపల్ ఎఇ ఆనంద్, సిఐ ప్రభాకరరావు పాల్గొన్నారు.

వైస్ ఎంపిపిని బర్తరఫ్ చేయాలని వినతి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మహిళా వాలంటీర్ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వైస్ ఎంపిపి నిమ్మక లక్ష్మణరావును బర్తరఫ్ చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్.సింహాచలం ఎంపిడిఒ సాల్మన్ రాజుకు శనివారం వినతిపత్రం అందించారు. దుడ్డుఖల్లు ఎంపిటిసి తనను అసభ్యకర మాటలతో వేధిస్తున్నారని మహిళా వాలంటీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆయనపై కేసు నమోదు అయినట్లు ఎంపిడిఒకు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నత అధికారులు దృష్టికి తెలియజేస్తానని ఎంపిడిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగ్గారావు, లక్ష్మణరావు తదితరులున్నారు.

మనుగడకే ముప్పు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీని పాలకులు పథకంగా చిత్రీకరిస్తున్నప్పటికీ వాస్తవంగా ఇది ఓ చట్టం. ఔను...! ఒక్కసారి 2004 ఎన్నికల ముందు నాటి పరిస్థితులు అవగతం చేసుకుంటే ఈ విషయం స్పష్టంగానే బోదపడుతుంది. అప్పట్లో ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవస్థలోవున్న లోపాలను గుర్తించిన కమ్యూనిస్టులు యుపిఎ-1 ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడానికి కనీస ఉమ్మడి కార్యక్రమం అంటూ కొన్ని షరతులు విధించారు. అందులో భాగంగానే అప్పటి మన్మోహన్‌సింగ్ 2005 జాతీయ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కుచట్టం, అటవీహక్కుల చట్టం, ప్రభుత్వం ఆహార భద్రతా చట్టం వంటివి రూపొందించి, అమలు చేసింది. అలా ఏర్పడిన ఉపాధి చట్టాన్ని బిజెపి అధికారంలోకి వచ్చాక పథకంలా మార్చేస్తోంది. ఈ చరిత్ర కాసేపు పక్కనబెడితే. ఉపాధి చట్టం మిగిలిన జిల్లాలతో పోలిస్తే నేటి విజయనగరం జిల్లాలోనూ, నాటి విజయగనరం ఉమ్మడి జిల్లాలోనూ అత్యంత కీలకంగా మారింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కేంద్ర బిందువుగా మారింది.



రెండు దశాబ్దాల ముందుకు వెళ్తే .. విజయనగరం జిల్లాలో అత్యధిక వలస కూలీలు ఉండేవారు. కనీస అవసరాలు తీర్చుకోలేని పేదలెందరో. భార్యాపిల్లల్ని, వృద్ధాప్యానికి చేరిన తల్లిదండ్రులను ఇళ్ల వద్ద వదిలి వలసపోవాల్సిన దుస్థితి అడుగడుగునా కనిపించేది. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి చట్టం వచ్చాక ఏటా 3.50లక్షల కుటుంబాలవారికి వంద రోజుల పని గ్యారెంటీగా దొరుకుతోంది. ఇందుకోసం ప్రభుత్వం జాబ్‌కార్డులు జారీచేసింది. కోరిన వెంటనే పని కల్పించాలని, సకాలంలో పని కల్పించకపోతే నష్టపరిహారం కూడా చెల్లించాలని ఈ చట్టంలో పేర్కొన్నారు. దీంతో, పని గ్యారెంటీగా దొరుకుతోంది. పొట్ట కూటి కోసం ఊరుకాని ఊళ్ల వలసపోయే కుటుంబాలవారికి ఇది ఎంతో ఆసరాగా నిలిచింది. స్థానికంగానే వంద రోజులు పని గ్యారెంటీ దొరుకుతుండడంతో గతంతో పోలిస్తే వలసలు తగ్గాయి. సేద్యానికి ప్రభుత్వం ఇచ్చే సాయం సరిపోకపోయినా, పంటలు పెద్దగా కలిసి రాకపోయినా, పండిన పంటలకు పెద్దగా గిట్టుబాటు ధర పలకపోయినా, పెరిగిన ధరల ప్రవాహంలో కొట్టుకుపోయినా, చివరకు డిగ్రీ, పీజీలు పూర్తిచేసిన వారికి కొలువులు లేకపోయినా ఏడాదిలో వంద రోజుల పని గ్యారెంటీ కావడంతో జిల్లాలో మెజార్టీ ప్రజానీకానికి ఉపాధి చట్టం ఎంతో భరోసా ఇచ్చింది. చదువుకున్న నిరుద్యోగులు, విద్యార్థులు మొదలుకుని, వృద్ధాప్యానికి చేరినవారు సైతం జీవనం కోసం ఉపాధి పనులకు వెళ్తున్నారు. ప్రస్తుతం విజయనగరం జిల్లాలో 3.40లక్షలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 1.68లక్షల చొప్పున మొత్తం ఈ రెండు జిల్లాల్లో 4.19లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. వీరంతా పని దినాలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఒక్క విజయనగరం జిల్లాలోనే సుమారు రూ.300కోట్ల మేర కూలీలకు సమకూరింది. అటు పార్వతీపురం మన్యం జిల్లాలోనూ ఇదే స్థాయిలో డబ్బులు చేతికందాయి. ఇందువల్లే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కొంతలో కొంతైనా కళకళాడుతోందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. 2020 నుంచి 2021 వరకు సుమారు రెండేళ్లపాటు కరోనా వల్ల విధించిన లాక్‌డౌన్ వల్ల దేశమంతా అతలా కుతలమైనా గ్రామాల్లోని ఉపాధి కూలీలు మాత్రం భద్రంగా బతికేశారు. ఇలా ఈ పథకాన్ని ఉపయోగించడంలో విజయనగరం ఉమ్మడి జిల్లా దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు శత విధాలా ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా రెండో సారి అధికారంలోకి వచ్చాక ఉపాధి చట్టానికి వందల రూ.కోట్లు నిధులు కోత విధిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఉపాధి పనులకు ఈ ఏడాది రూ.73వేల కోట్లను కుదించింది. గతేడాది వరకూ చెల్లించిన వేసవి అలవెన్సులు రద్దుచేసింది. గునపాం, పార వంటి పనిముట్లకు అదనంగా ఇచ్చే పరిహారం ఇవ్వలేదు. చివరికి మండుతున్న ఎండలో నిలువనీడ, నీరు కల్పించేందుకు ఉన్న అవకాశాలను తొలగించింది. మరోవైపు రెండు పూటలా పనిచేయాలనే నిబంధన పెట్టింది. అందుకు తగ్గ కూలి రావడం లేదు. విజయనగరం జిల్లాలో 2021-22లో ఒక్కపూట పనిచేస్తే కార్మికుడి వేతనం రూ.250 నుంచి రూ.257 అందగా, 2022-23లో రెండు పూటలా పనిచేసినా రూ.200కు మించలేదు. పార్వతీపురం మన్యం జిల్లాలోనూ కూలిరేటు కాస్త అటు ఇటు అయినా వ్యత్యాసం దాదాపు ఇంతే. ఈ రెండు జిల్లాల్లోనూ మునుపెన్నడూ లేనంతగా వేతన బకాయిలు కూడా ఉన్నాయి. దీని నుంచి దృష్టిమళ్లించేందుకు గత ఏడాది నుంచీ యాప్ ఆధారిత హాజరు అమల్లోకి తీసుకొచ్చింది. ఇలా విధించిన కఠిన నిబంధనల కారణంగా కూలీలు పనిచేందుకు ముందుకు రాకపోతే, ఏకంగా ఉపాధి చట్టాన్నే రూపుమాపేందుకు కుట్ర పన్నుతుందన్నది. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఈనెల 22న కలెక్టరేట్ వద్ద రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టేందుకు కూలీలు సన్నద్ధమౌతున్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-వీరఘట్టం

ఎంఇఒ కృష్ణమూర్తి, కెజిబివి ఎస్ఒ రోహిణిపై సస్పెన్షన్లను ఎత్తివేయాలని విద్యాశాఖాధికారులు శనివారం వండవలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కళావతికి వినతి అందించారు. ఇటీవల విద్యార్థులకు పుస్తకాలు సరిగా పంపిణీ చేయలేదని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ వారిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. కెజిబివిలో పదో తరగతి చదివిన విద్యార్థులందరూ ఫస్ట్‌క్లాస్‌లో పాస్ అయినట్లు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావతి స్పందిస్తూ ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్తానని హామీఇచ్చారు.

పెట్రోల్ బంకు నిర్మాణానికి గిరిజనుల అంగీకారం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల సమీపంలో మంతినివలస గిరిజనుల శ్మశాన వాటిక వద్ద ఐటిడిఎ పెట్రోల్ బంకు నిర్మాణానికి గిరిజనులు అంగీకరించారు. కొద్దిరోజులుగా గిరిజనులకు, అధికారులకు మధ్య జరుగుతున్న స్థల వివాదంపై శనివారం తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, ఎల్విన్‌పేట సిఐ పి.సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ఎస్ఐ షణ్ముఖరావు గిరిజనంతో చర్చించారు. ప్రస్తుత శ్మశానవాటిక వెనుక ఉన్న స్థలం శ్మశానానికి ఇచ్చేందుకు అధికారులు అంగీకరించడంతో గిరిజనులు పెట్రోల్ బంకు నిర్మాణానికి ఒప్పుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ పిఎల్‌వి ప్రసాద్, మండల సర్వేయర్ కె.రవికుమార్ పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

అధిక ఉష్ణోగ్రతల కారణంగా కార్మికులకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు రాకుండా ప్రతి పరిశ్రమలో నిర్మాణ రంగ సంస్థల యజమానులు తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎసిఎల్ కిరణ్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. పని గంటలను ఉదయం, సాయంత్రం వేళలకు మార్పు చేసుకునేలా చూడాలని చెప్పారు. కార్మికులకు పీస్ రేట్ ధరలను ప్రభుత్వ నియమాల ప్రకారం అందించాలని సూచించారు. పని ప్రాంగణంలో తగిన తాగునీటి సదుపాయం కల్పించాలని తెలిపారు. కార్మికులకు ఆరోగ్య పరీక్షలు ఆరోగ్య శాఖ సహకారంతో నిర్వహించాలని, ఒఆర్ఎస్ పాకెట్లు, అవసరమైన ఔషధాలు అందించాలని సూచించారు.

పవన్‌ను కలిసిన జిల్లా నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం

పవన్‌కు మొక్కను అందజేస్తున్న అక్కివరపు మోహనరావు

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు అక్కివరపు మోహనరావు హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్వతీపురం నియోజకవర్గ ప్రజల సమస్యలు, రాజకీయ పరిస్థితులను పవన్ కళ్యాణ్ వారితో చర్చించారు. అధినేత ఆదేశాల మేరకు నియోజకవర్గంలో జనసేన అభివృద్ధికి కంకణం కడతామని మోహనరావు తెలిపారు.

కురుపాం : జనసేన పార్టీ అధ్యక్షులు పవన కళ్యాణ్‌ని ఆ పార్టీ నియోజకవర్గ జనసేన నాయకులు నేరేడబిల్లి వంశీ మర్యాదపూర్వకంగా కలిశారు.

పాఠశాలను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను డిఇఒ ప్రేమ్ కుమార్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. పాఠశాల స్టాక్ పాయింట్‌లో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సూరిదేముడు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని కాశీపేట గ్రామంలో జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. శనివారం కాలనీలో గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా కావలసిన సహకారాన్ని అందిస్తామని తెలిపారు. లబ్ధిదారులు ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.మురళీకృష్ణ, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల కేంద్రం.. ప్రారంభానికి సిద్ధం

ప్రజాశక్తి-వీరఘట్టం

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భవనం

మండలంలోని యు.వెంకంపేట పంచాయతీ పరిధి వెంకమ్మ సాగరం వద్ద రైతు ఉత్పత్తిదారుల కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉందని సిసి వై.ఆనంద్ తెలిపారు. సుమారు రూ.15 లక్షల వ్యయంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రూ.11.25 లక్షలు, రైతు ఉత్పత్తిదారుల సంఘం నుండి రూ 3.75 లక్షలతో నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో రైతు ఉత్పత్తిదారుల కేంద్రం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

సేవలతో ప్రజలకు మరింత చేరువ

ప్రజాశక్తి-మక్కువ

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేస్తూ సేవలు అందిస్తూ వాలంటీర్లు మరింత చేరువ కావాలని జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు అన్నారు. శనివారం కాశీపట్నం పంచాయతీలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు ప్రజలకు ఎంతో లబ్ధి చేకూర్చాయన్నారు. ప్రభుత్వ పథకాలను అందించడంలో వాలంటీర్లు పనిచేస్తున్న తీరును గుర్తిస్తూ ప్రభుత్వం గౌరవ సత్కారాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు రంగునాయుడు, ఎంపిడిఒ దేవకుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని బొడ్లపాడు గ్రామ సమీపంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఎంపిడిఒ వై.వెంకటరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ నిబంధనల మేరకు పనులు చేస్తే కనీస వేతనం లభిస్తుందన్నారు. ఆ దిశగా పనులు చేయాలని వేతన దారులకు సూచించారు.

రోగులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

తెర్లి గౌరినాయుడు వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్మోహన్‌రావు శనివారం 23 మంది పేదలకు, లెప్రసీ కాలనీలో రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన సోదరి టి.హేమాక్షి, బివి దుర్గాప్రసాద్, సాలాపు అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఇప్పలపోలమ్మను దర్శించుకున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురంలో ఇప్పల పోలమ్మ గ్రామదేవతను శనివారం ఆర్‌డిఒ కె.హేమలత దర్శించుకున్నారు. ఆర్‌డిఒకు ఉత్సవ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాలను ఆర్‌డిఒ పరిశీలించారు. ఈ నెల 28 నుంచి జరిగే ఉత్సవ ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో చర్చించి, సూచనలు చేశారు.

16, 17న గిరిజన సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో జూన్ 16, 17 తేదీల్లో గిరిజన సంఘం మన్యం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర కోరారు. స్థానిక కిశోర్ చంద్రదేవ్ డిగ్రీ కళాశాలలో శనివారం గిరిజన సంఘం మహాసభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన హక్కులను, చట్టాలను కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎత్తివేస్తోందన్నారు. జిఒ 3ని సుప్రీంకోర్టు రద్దుచేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదని మండిపడ్డారు. అటవీహక్కుల చట్టాన్ని ఎత్తివేసి గిరిజనుల భూములు, అడవులను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అటవీ సంరక్షణ చట్టానికి సవరణలు తీసుకొచ్చి గిరిజనులను అడవిలోకి వెళ్లనివ్వకుండా చేయాలని చూస్తున్నారని విమర్శించారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాల కంటే ఘోరమైన చట్టాలను తీసుకువచ్చి అటవీ ఉత్పత్తులు గాని, కర్రలు గాని, జీవనోపాధికి సంబంధించిన ఏ ఆధారాన్ని గిరిజనులు అడవి నుంచి పొందకుండా చేయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. మైనింగ్ పేరుతో కొండలన్నీ కార్పొరేట్లకు అప్పజెప్పి గిరిజనులను అడవుల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. గిరిజనులు ఏకతాటిపైకి వచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. జూన్ 16, 17 తేదీల్లో కురుపాంలో జరిగే జిల్లా మహాసభలను పెద్ద ఎత్తున గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గిరిజన సంఘం జిల్లా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర, నాయకులు

ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, జిల్లా కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు ఎం.లక్ష్మణరావు, జిల్లా కమిటీ సభ్యుల కె.సీతారాం, పి.తిరుపతిరావు పాల్గొన్నారు.

పిక్కతీత కార్మికులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని చింతపండు పిక్కతీత కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు ఆధ్వర్యాన డిప్యూటీ సిఎం రాజన్నదొరకు వినతిపత్రం అందజేశారు. 40 రోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని చెప్పారు. ఈ ఏడాది మార్చితో చింతపండు పిక్కతీత కార్మికులకు, గోడౌన్ యజమానులకు మధ్య ఒప్పందం ముగిసిందని చెప్పారు. పాత ఒప్పందం ప్రకారం కిలో చింతపండు పిక్కతీతకు 19 రూపాయలు చెల్లించేవారని, ఈ ఏడాది నుంచి 24 రూపాయలు చెల్లించాలని కోరారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పిక్కతీత రేటు పెంచాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా లేబర్ అధికారితో మాట్లాడి కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని ఎన్‌వై నాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికుల సంఘం నాయకులు శ్యామల పార్వతి పాల్గొన్నారు.

పాలీసెట్‌లో ప్రతిభ

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

ప్రభుత్వం శనివారం విడుదల చేసిన పాలీసెట్-2023 ప్రవేశ పరీక్ష ఫలితాలలో పార్వతీపురం మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నర్సిపురానికి చెందిన భాత అభినందన్ 1100 ర్యాంకు, వెంకంపేట పంచాయతీ ఆఫీసర్స్ కాలనీకి చెందిన ఎంఎం సిరిచందన 1123 ర్యాంకు సాధించారు.

చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

కురుపాం.. చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలోని రావాడ జంక్షన్ వద్ద వైసిపి ఆధ్వర్యాన టిడిపి అధినేత చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం ఇస్తున్న సెంటు భూమి శవం పూడ్చడానికి కూడా సరిపోదన్న చంద్రబాబు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, ఎంపిపిలు శెట్టి పద్మావతి, కె.దీనమయ్య, శెట్టి శ్యామల, ఉరిటి రామారావు, జెడ్‌పిటిసిలు జి.సుజాత, ఎం.శశికళ, వైసిపి గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, అయ్యారకల కార్పొరేషన్ డైరెక్టర్ జి.విజయ్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : దళితులకు ఇస్తున్న ఇళ్ల స్థలాలపై అవాంఛనీయ వ్యాఖ్యలు చేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు దిష్టిబొమ్మను శనివారం వైసిపి నాయకులు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ టిడిపి అధినేతకు మొదటి నుంచి దళితులంటే చులకన భావం ఉందన్నారు. వారికి ఇచ్చిన ఇళ్ల స్థలాలను సమాధి స్థలాలుగా పోల్చడం ఆక్షేపణీయమని అన్నారు. చంద్రబాబు వైఖరి ఇలాగే కొనసాగితే రాబోయే ఎన్నికల్లో టిడిపి కనుమరుగవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైసిపి పట్టణ కన్వీనర్ కొండపల్లి బాలకృష్ణ, కౌన్సిలర్ త్రినాథ, నాయకులు బొంగు చిట్టి రాజు, బడే రామారావు, గురురాజు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో కోతలు, వాతలే

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

నాలుగేళ్ల వైసిపి పాలనలో ప్రజలు కోతలు, వాతలే అనుభవిస్తున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.సంధ్యారాణి అన్నారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఎన్నడూ విద్యుత్ కోతలు లేవని చెప్పారు. ప్రజలు సుఖ, సంతోషాలతో ఉన్నారన్నారు. జగన్ పాలనలో విద్యుత్ కోతలు, ఛార్జీల బాదుడుతో ప్రజలు అల్లాడిపోతున్నారని తెలిపారు. విద్యుత్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు ఉండదో తెలియని అయోమయంలో జనం కొట్టుమిట్టాడుతున్నారని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని, పేదలపై పెనుభారం పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు బతకలేని పరిస్థితిలో ఉన్నారని, ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని సంధ్యారాణి చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఎం.శ్యామ్, యుగంధర్ పాల్గొన్నారు.

విద్యుత్తు కోతలతో తప్పని కష్టాలు

గుమ్మలక్ష్మీపురం : విద్యుత్తు ఉత్పత్తి పట్ల ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో వేసవిలో ప్రజలకు కరెంటు కష్టాలు తప్పడం లేదని టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటనలు చేసిన వైసిపి ప్రభుత్వం వేసవిలో తీవ్ర విద్యుత్తు కోతలు విధిస్తోందని మండిపడ్డారు. ఎప్పటికప్పుడు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో చిన్నారులు, గర్భిణులు, రోగులు, వృద్ధులు ఉక్కపోతతో తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు.

ఈ దుస్థితి గత ప్రభుత్వంలో లేదని చెప్పారు. ఇప్పటికైనా ప్రజల కష్టాలను గుర్తించి నిరంతరం విద్యుత్తు సరఫరా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, నాయకులు అడ్డాకుల నరేష్ తదితరులు ఉన్నారు.

నాడు-నేడు పనులు పూర్తిచేయాలి

ప్రజాశక్తి-సీతానగరం

మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాద్

జూన్ 12లోగా పాఠశాలలో మంజూరైన నాడు నేడు పనులు పూర్తి చేయాలని ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం నాడు-నేడు పనులపై ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ దశలలో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోపు పూర్తి చేస పాఠశాలలో మంచి వాతావరణాన్ని తీసుకురావాలన్నారు ఎంఇఒ జి.సూరిదేవుడు మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలోనూ విద్యార్థులకు మంచి బోధనలు అందించి, ఉత్తర్ణతశాతం తీసుకురావడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఇంజినీరింగ్ అధికారి రామారావు, వైకెపి ఎపిఒ ఆర్.శ్రీరాములు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సక్రమంగా వైద్య సేవలు అందించాలి

ఏరియా ఆసుపత్రిని పరిశీలించిన వైస్ చైర్మన్

ప్రజాశక్తి-సాలూరు

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు కోరారు. శనివారం వంగపండుతోపాటు వైసిపి కౌన్సిలర్లు, నాయకులు ఏరియా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగుల వద్దకు వెళ్లి వైద్యసేవలు, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు విధి నిర్వహణలో భాగంగా రోజూ రావడం లేదని ఫిర్యాదులు రావడంతో వారు ఆసుపత్రిని ఆకస్మికంగా పరిశీలించారు. వైద్యులు విధులకు గైర్హాజరైతే డిప్యూటీ సిఎం రాజన్నదొరకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పి.మధుసూదనరావు, మాజీ కౌన్సిలర్ తాడి శంకరరావు, వైసిపి నాయకులు పి.అప్పలస్వామి, బి.బాలకృష్ణ, కర్రి మహేష్ పాల్గొన్నారు.

సూడిగాంలో గడపగడపకు..

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని సూడిగాం గ్రామంలో శనివారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందుతున్న వారిని కలుసుకొని పథకాల తీరును వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ ఎంపిపి ఎం.శోభారాణి, సర్పంచి సూర్యనారాయణ, నాయకులు బొమ్మి రమేష్, బలగ నాగేశ్వరరావు, మడక విశ్వనాథం, భీమవరపు కృష్ణమూర్తి, మజ్జి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పాలకొండ

సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ సర్వేశ్వరరావు

పట్టణంలో పరిసరాల పరిశుభ్రత, కాలుష్య నియంత్రణే ధ్యేయంగా ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అందరితో ప్రతిజ్ఞ చేయించారు. పట్టణంలో చెత్తను సులువుగా సేకరించే విధంగా 9 సచివాలయాల పరిధిలో రీసైక్లింగ్ ప్రక్రియకు ఉపయోగపడే పాత పుస్తకాలు, దుస్తులు, బొమ్మలు, ప్లాస్టిక్ వస్తువులు, బూట్లు తదితర వస్తువులను పెద్ద ఎత్తున ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు అందించే విధంగా పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చైర్‌పర్సన్ తెలిపారు.

టిడిపిలోకి 70 గిరిజన కుటుంబాలు

ప్రజాశక్తి - కురుపాం

టిడిపిలో చేరిన వారితో నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

మండలంలో వబ్బంగి పంచాయతీలో కోసింగూడ, బుడ్డడగూడ, జలుబుగూడ గిరిజన గ్రామాల నుంచి 70 కుటుంబాలు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి ఆధ్వర్యంలో 70 గిరిజన కుటుంబాలు ఆ పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పరిపాలన చూసి ప్రజలు విసిగి చెంది టిడిపిలో చేరుతున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో టిడిపిదే భవిష్యత్తు అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కె.వి. కొండయ్య, టిడిపి నాయకులు చిలకలపల్లి వెంకటరావు, ఎన్.కృష్ణబాబు, శంకర్ ,ప్రదీప్ , నరేష్, రాజేష్, త్రినాథ్‌తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల్లో డిజిటల్ విప్లవం

సెల్‌ఫోన్ టవర్ల నిర్మాణంతో ప్రజలకు అందుబాటులో సేవలు

సెల్‌ఫోన్లతో గిరిజన మహిళలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మారుమూల గిరిజన గ్రామాలకు పూర్తిస్థాయిలో సెల్ ఫోన్ నెట్‌వర్క్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు అనుగుణంగా పలు గ్రామాల్లో సెల్‌ఫోన్ టవర్ల నిర్మాణం చేపడుతున్నారు. నేటికీ చాలా గిరిజన గ్రామాల్లో సమాచారం అందక గిరిజనులు వెనుకబడి ఉన్నారు. సెల్‌ఫోన్ సేవలు లేకపోవడంతో బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్నారు. గతంలో ఏదైనా సమాచారం అందాలంటే కాలినడకన వెళ్లి చెప్పాల్సిందే. దీంతో కనీసం ఒకరోజు పట్టేది. మరోవైపు సచివాలయ సేవలు ప్రజలకు ఆటంకంగా మారాయి. సిగ్నల్స్ కోసం నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండలు, గుట్టలు ఎక్కుతూ సేవలు అందిస్తున్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు సమాచార వ్యవస్థను విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఏజెన్సీలో సమాచార వ్యవస్థ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకొంది. మారుమూల గ్రామాల్లో సైతం ప్రతిఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్ ద్వారా సమాచార వ్యవస్థను అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీలో డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టింది. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస ఏజెన్సీ మండలాల్లో మారుమూల గ్రామాల్లో సైతం సెల్‌ఫోన్ టవర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. మారుమూల ప్రాంతాలైన అచ్చబ, దేరువాడ, గోయపాక, రంగుపురం, లాడ, గుణద తదితర మారుమూల గిరిజన గ్రామాల్లో సెల్ టవర్లు నిర్మిస్తున్నారు.

ఏజెన్సీలో నిర్మించిన సెల్‌టవర్

పార్వతీపురం మన్యం జిల్లాలో 170 మొబైల్ టవర్ల నిర్మాణం జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. రెవెన్యూ, పోలీస్, ఫారెస్ట్ సిబ్బంది సహకారంతో స్థల పరిశీలన చేపట్టారు. ఈ ప్రాంతంలో బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ సెల్‌టవర్ల నిర్మాణం చేపడుతున్నారు. జూన్ నాటికి 160 టవర్లు పూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. సమాచార వ్యవస్థ అందుబాటులో లేని గిరిజన గ్రామాలను గుర్తించి ముందుగా మొబైల్ టవర్ల నిర్మాణం చేపడుతున్నారు.

ప్రభుత్వ సేవలకు మరింత చేరువ

మారుమూల గ్రామాల్లో 4జి నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తే ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కానున్నాయి. ముఖ్యంగా ఎమర్జెన్సీ సమయంలో 108 అంబులెన్సు సేవలు, టెలీ మెడిసిన్ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మరోవైపు రేషన్ సరుకులకు బయోమెట్రిక్, ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులు ఫేస్ యాప్ వినియోగించుకోవడానికి వీలుంటుంది. సచివాలయంలో పనులు ఆన్‌లైన్ ఎప్పటికప్పుడు కూడా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ ఉపాధి అవకాశాలు, వార్తా పత్రికలు, టీవీ న్యూస్ నేరుగా మొబైల్‌లో వీక్షించవచ్చు.

సంతోషంగా ఉంది

మా గ్రామాల్లో సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా నేటికీ సమాచార వ్యవస్థ అందుబాటులో లేకపోవడంతో బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్నాం. ఇకపై సెల్‌ఫోన్ ద్వారా అన్ని విషయాలు తెలుసుకోవడానికి వీలుంటుంది.

- పువ్వల గోవిందరావు, వనకాబడి వైస్ ప్రెసిడెంట్

అందుబాటులో సమాచారం

గిరిజన గ్రామాల్లో సెల్‌ఫోన్ టవర్లు నిర్మించడంతో గిరిజనులకు పూర్తి స్థాయి సమాచారం తెలుసుకోవడానికి వీలుంటుంది. అధికారులు ప్రజల కష్టాలను తెలుసుకొని ఏజెన్సీలో సెల్ టవర్లు నిర్మించడం అభినందనీయం.

-ఎం.నూకయ్య, గిరిజనుడు కేసరిగూడ

పెదపెంకిలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-బలిజిపేట

పెదపెంకి గ్రామంలో బస్టాండ్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని శనివారం ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు సంజీవ నాయుడు సమక్షంలో ఏర్పాటు చేశారు . ఈ కార్యక్రమంలో అజంత్, నాని, ఆవు సురేష్, కరణం నాగరాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రిజర్వాయరులో ఇద్దరు గల్లంతు

ఒకరి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పాచిపెంట

జోగయ్య, సీతారాం (ఫైల్)

పెద్దగెడ్డ రిజర్వాయరులో చేపలవేటకు వెళ్లిన ఇద్దరు గిరిజనులు గల్లంతయ్యారు. అందులో ఒకరి మృతదేహం శనివారం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మడవలసకు చెందిన బంటు జోగయ్య (50), యర్రడ్లవలసకు చెందిన పుంగారి సీతారాం శుక్రవారం పెద్దగెడ్డ జలాశయంలో శుక్రవారం చేపలవేటకు వెళ్లారు. వీరిలో బంటు జోగయ్య మృతదేహం శనివారం లభ్యమైంది. సీతారాం ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. జోగయ్యకు భార్య, పిల్లలు ఉన్నారు. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ ఎం.వెంకటరమణ కేసు నమోదు చేశారు.

భార్య తిట్టిందని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కొమరాడ మండలం గుణానుపురానికి చెందిన ఆకుల శ్రీనివాసరావు కారు డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం తన అత్తవారి గ్రామం మార్కొండపుట్టి వెళ్లి చింతపండు కొనుగోలు విషయమై భార్య విమలతో గొడవపడ్డాడు. ఆమె పాత సంఘటన గుర్తు చేస్తూ పరుషంగా మాట్లాడటంతో మనస్తాపానికి గురై స్నానపుగదిలో ఉన్న ఫినాయిల్ తాగాడు. స్థానికులు వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.